క్లుప్తంగా

బుడమేరులో గుర్రపు డెక్క తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో పేరుకుపోయిన వ్యర్థాలు, గుర్రపు డెక్క, చెట్లకొమ్మలను గురువారం వీఎంసీ సిబ్బంది తొలగించారు. బుడమేరులో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన చెట్ల కొమ్మలు, గుర్రపు డెక్క, వ్యర్థాలను బోటు సాయంతో తొలగించారు. నాలుగు బోట్‌లతో వీటిని తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూశారు. బుడమేరులో చెత్తాచెదారం వేయరాదని, చెత్త వేయటం వల్ల నీటి ప్రవాహం నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమలు పెరిగే ప్రమాదం ఉందని స్థానికులకు వీఎంసీ సిబ్బంది సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ శ్రీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ సీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్ర బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ మూడు, నాలుగు, ఐదు రోడ్లు, జాగర్లమూడి వారి వీధి, అడవి శేషగిరిరావు వీధి, మల్లిక్ స్ట్రీట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం బీఆర్‌టీఎస్ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో పేద విద్యార్థులకు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్‌కే షఫీవుల్లా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ రిపోర్టులు పరిశీలించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఆర్‌ఓ ప్లాంట్లలో నీటి శుద్ధత ల్యాబ్ రిపోర్టులు పరిశీలించి వారికి ట్రేడ్ లైసెన్స్, వాటర్ టెస్టింగ్ తాజా ల్యాబ్ రిపోర్ట్ లేకపోయినా వెంటనే సీజ్ చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శాఖాధిపతులు, ప్రజారోగ్యం విభాగం సిబ్బందితో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తమ పరిధిలో గల ఆర్‌ఓ ప్లాంట్ల ద్వారా తాగునీటి సరఫరా వ్యాపారం చేస్తున్న వారిని పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌లు, నీటి పరీక్షల ల్యాబ్ రిపోర్ట్ లేకపోతే వెంటనే ప్లాంట్లు మూసివేసే విధంగా చూడాలని పేర్కొన్నారు. ల్యాబ్ రిపోర్ట్‌లో ఎటువంటి ప్రమాదం లేదు అని నిర్ధారించుకున్న తర్వాతే తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. నగర పరిధిలో అటువంటివి ఎన్ని ప్లాంట్‌లు ఉన్నాయో వెంటనే తనకు నివేదించాలని ఆదేశించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏపీ గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీజీబీ బీఎంఎస్ నాయకులు ఆ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి, జనరల్ మేనేజర్ రఘునాథరెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ మేరకు సంఘ నాయకులు జి.వెంగళరెడ్డి, డీవీఎస్ రావు తదితరులు గురువారం వారిని కలిసి సమస్యల గురించి వివరించారు. వాటి విషయంలో చైర్మన్ సానుకూలంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అదుపు తప్పితే.. బుడమేరులోకే..

- ప్రమాదకరంగా రహదారి మార్జిన్‌లు
- దావుబుచ్చయ్యకాలనీలో నెలకొన్న పరిస్థితి
- రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని స్థానికుల వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని 30వ డివిజన్ జీవీఆర్‌నగర్ పరిధిలో ఉన్న దావు బుచ్చయ్యకాలనీ ప్రాంతంలో ఉన్న గుణదల రోడ్డు ప్రమాదకరంగా మారింది. బుడమేరు పక్కన ఉన్న ఈ రహదారికి కనీసం మార్జిన్‌లు సైతం లేవు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు బుడమేరులోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. దీంతో వాహనచోదకులు బిక్కుబిక్కు మంటూ ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల వరద సమయంలో బుడమేరులో చెత్తచెదారాన్ని తొలగించే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగించారు. దీంతో ఉన్న కొద్ది పాటి రక్షణ కూడా కరువయిందని స్థానికులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట రాకపోకలు సాగించే క్రమంలో అదుపు తప్పితే బుడమేరులోకి వెళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. రోడ్డుకు మార్జిన్‌లు లేకపోవడం, కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒక కారు అదుపు తప్పి బుడమేరులోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బుడమేరులో నీటి మట్టం అంతగా లేకపోవడంతో కారులోని వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. కారుకు మాత్రం నష్టం వాటిల్లింది. ప్రస్తుతం బుడమేరులో నీటి ప్రవాహం పెరిగింది. ఈ నేపథ్యంలో వాహనాలు బుడమేరులోకి దూసుకెళ్తే ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు



గుణదల రోడ్డులో బుడమేరు పక్కన పాతిన ఎర్ర జెండాలు

రోడ్డు విస్తరణ ఎప్పటికో...

జీవీఆర్‌నగర్ నుంచి గుణదల వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రోడ్డు నిర్మించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయే యజమానులకు బాండ్లు సైతం జారీ చేశారు. కానీ కొంతమంది స్థల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేయటంతో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఇంతలో ప్రభుత్వం మారటంతో ఇక్కడ రోడ్డును పట్టించుకునే వారు కరువయ్యారు. ఫలితంగా రోడ్డు విస్తరణ పనులు కలగానే మిగిలిపోయాయి.

రిటైనింగ్‌వాల్‌తో రక్షణ

బుడమేరు పొడవునా కృష్ణానది తరహాలో రిటైనింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మించటం వల్ల భద్రత పెరుగుతుందని పేర్కొంటున్నారు. ప్రమాదకరంగా మారిన బుడమేరు పక్కన మార్జిన్‌లు పటిష్టంగా తయారు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు రోడ్డుకు చివరగా ఉన్నాయి. ఫలితంగా రోడ్డు మొత్తం వెలుతురు సరిపోవటం లేదని, చీకటిలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్ హోల్ పనులలో భాగంగా రోడ్డును తవ్వటం వల్ల రోడ్డు గుంతలమయంగా మారింది. గుంతలను తప్పించే క్రమంలో అదుపు తప్పితే బుడమేరులోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంది.

రాత్రివేళ భయం.. భయం



బుడమేరు పక్కన ఉన్న రోడ్డులో రాత్రిపూట రాకపోకలు సాగించాలంటేనే భయంగా ఉంది. ఈ రోడ్డుకు కనీసం మార్జిన్‌లు లేవు. మ్యాన్‌హోల్ పనుల కోసం తవ్విన గుంతలను పూడ్చలేదు. ఈ గుంతలను తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌లను సరిచేయాలి.

– సురేష్, దావు బుచ్చయ్యకాలనీ

రోడ్డుతో ఇబ్బంది



ఈ రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులకు విస్తరించాలి. ప్రస్తుతం రోడ్డు చిన్నగా ఉండటంతో పాటు గుంతలు, బుడమేరు పక్కన మార్జిన్‌లు లేకపోవటం వల్ల ఇబ్బందిగా ఉంది. ఎదురెదురుగా భారీ వాహనాలు వస్తే ఇబ్బందులు తప్పవు. ఈ మార్గంలోనే పిల్లలు గుణదలలోని స్కూలుకు వెళ్తున్నారు. పిల్లలు ఇంటికి వచ్చే వరకు ఆందోళనగా ఉంటుంది.

–కె.వెంకటరెడ్డి, దావు బుచ్చయ్యకాలనీ

డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలో డయేరియా నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని, కాలం తీరిన మంచినీటి పైప్‌లైన్లను మార్చేందుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజా ఆరోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి జి.విజయ్‌ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యూ రాజరాజేశ్వరి పేటలో కలుషిత మంచినీటిని తాగి 23 మందికి పైగా అస్వస్థతకు గురై ఒకరు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మంచి నీటి పైపులైన్ల మరమ్మతులు సకాలంలో చేయకపోవడంతోనే మురుగు నీరు కలిసి రక్షిత మంచి నీరు కలుషితం కావడంతో నగరంలో డయేరియా కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. గతంలో మొగల్రాజపురంలో కూడా ఇదే తరహాలో డయేరియా కేసులు నమోదయ్యాయని, అప్పుడు ఇద్దరు మృతి చెందడం జరిగిందన్నారు. విజయవాడ రాష్ట్ర రాజధాని ప్రాంతంలో ఉండి జాతీయ స్థాయి స్వచ్ఛభారత్ అవార్డులు పొందుతున్నప్పటికీ ప్రజలకు రక్షిత మంచినీటిని అందించడంలో నగరపాలక సంస్థ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. డయేరియాతో ఆసుపత్రి పాలైన రోగులందరికీ అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు నగరంలో డయేరియా కేసులు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలం తీరిపోయిన తాగునీటి పైపులన్నింటినీ మార్చి కొత్త పైప్‌లైన్ వేయాలని సూచించారు. నగర వ్యాప్తంగా అందుకు అవసరమైన తనిఖీలను వెంటనే చేపట్టాలని కోరారు. అతిసార వ్యాధిని నివారించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ ఆర్వో ఫిల్టర్లు ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థితిగతులు లేనందున రక్షిత మంచినీటిని వీఎంసీ అత్యంత బాధ్యతాయుతంగా సరఫరా చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం



బాధితులను పరామర్శిస్తున్న మల్లాది విష్ణు

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వానికి బాధ్యత లేదని, పేదల ప్రాణాలంటే చంద్రబాబుకు ఎప్పుడూ చులకన భావనే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. స్థానిక 57వ డివిజన్ న్యూఆర్‌ఆర్‌పేటలో కలుషిత నీరు తాగి డయేరియా బారిన పడిన బాధితులను స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గురువారం ఆయన పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని ధైర్యం చెప్పారు. అనంతరం మల్లాది విష్ణు మీడియాతో మాట్లాడుతూ.. డయేరియా సమస్యను గుర్తించి 48 గంటలు గడుస్తున్నా ప్రభుత్వం ఇంకా దీనికి కారణాలేంటో తెలుసుకోలేకపోవడం బాధాకరమన్నారు. రెండు రోజుల తరువాత అధికారులందరూ ఇప్పుడు సమావేశాలు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో, న్యూఆర్‌ఆర్‌పేటలోని వైద్య శిబిరాలలో డయేరియా బాధితులకు కనీసం బెడ్లు కూడా సరిగా లేవనీ దుయ్యబట్టారు. పేద ప్రజల ప్రాణాలపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. అసలు న్యూఆర్‌ఆర్‌పేట, విజయవాడ నగరంలో పారిశుద్ధ్య విభాగ పనితీరును చూస్తుంటే అసలు ప్రభుత్వం ఉందా లేదా అనే సందేహం కలుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఈ ప్రాంతంలో ఏర్పడిన సమస్యకు కారణాలను తెలుసుకొని భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ నజీర్ ఖాన్, కాళ్ల ఆదినారాయణ, బాల, ప్రేమ కుమార్, కొఠారి ఉత్తమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ అభ్యర్థులు, డీవైఎఫ్‌ఐ కార్యకర్తలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డీవైఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 13 ప్రకారం 2,260 పోస్టులకు సిలబస్ ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేసింది. గురువారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ధర్నా జరిగింది. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఈ ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 86 వేల మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేసి వారి శక్తి, సామర్థ్యాలను సమాజం కోసం వినియోగించుకోవాలని కోరారు. ప్రతి నోటిఫికేషన్ నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని ఉండాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జూలై 15, 2025 లోపు స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు. 20 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ, డీఈడీ చేసిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగర నాయకులు బసవ, కృష్ణ, మహేష్ అభ్యర్థులు బాబు, మధు, లోకేష్, దివ్య, రమ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా



పటమట(విజయవాడతూర్పు):కొత్త రాజరాజేశ్వరి పేటలో పైప్ లైన్ల ద్వారా సరఫరా అవుతున్న నీటిని వాడుక అవసరాలకే ఉపయోగించాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా విజయవాడ నగరపాలక సంస్థ వారు సరఫరా చేసే నీరును కేవలం వాడుటకు మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. తాగునీటి కోసం ట్యాంకర్లు, బబుల్స్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నామన్నారు.

ఎట్టకేలకు జూనియర్ కాలేజీకి ప్రహరీ నిర్మాణం



కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి ఎట్టకేలకు ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభమయ్యాయి. జనవరి నాలుగో తేదీన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వచ్చిన సందర్భంగా కాలేజీ విద్యార్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జూన్ నెల ప్రారంభానికి అడిగిన సదుపాయాలను కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ అమలుకు నోచుకోలేదు. ఇంటర్మీడియెట్ బోర్డు రూ.19 లక్షలు మంజూరు చేయడంతో ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. తాము కోరిన అదనపు తరగతి గదుల మంజూరు విషయంలో ప్రభుత్వం వైఖరి ప్రశ్నార్థకంగా ఉందని విద్యార్థులు పేర్కొంటున్నారు. తరగతి గదులు చాలక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. కాలేజీకి రంగులు వేయడం, మైదానాన్ని మెరక చేయడం వంటి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి అదనపు తరగతి గదులకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

దాహం తీర్చండి.. మహాప్రభో!



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు



ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేవి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): డయేరియాతో బాధపడుతున్న న్యూరాజరాజేశ్వరీపేటలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. కలుషిత నీటి వల్ల ప్రజలు అనారోగ్య బారిన పడినట్లు తెలుసుకున్న అధికారులు ఈ ప్రాంతంలో కుళాయిలను నిలిపివేసి ట్యాంకర్ల ద్వారా వాడుక అవసరాలకు, టిన్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. అయితే వాటర్ ట్యాంకర్లు, వాటర్ టిన్‌లు చాలా ప్రాంతాలకు చేరడంలేదు. ప్రధానంగా అపార్ట్‌మెంట్ల ప్రాంతానికి తాగునీరు లేకపోవడంతో ఇక్కడి ప్రజలంతా వైద్య శిబిరాల వద్దకు వచ్చి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడే ఉన్న కార్పొరేటర్ ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రాంతాలకు కూడా తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ట్యాంకర్ల ద్వారా రంగు మారిన నీరు

ట్యాంకర్ల ద్వారా గురువారం పంపిణీ చేసిన నీరు రంగు మారి రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు మాత్రం వాటిని పరీక్షించాకే సరఫరా చేస్తున్నామని, ఎటువంటి సమస్యలూ తలెత్తవని చెబుతున్నారు. అయితే ప్రజలు మురికిగా ఉన్న ఈ నీటితో స్నానాలు చేస్తే చర్మ రోగాలు సోకుతాయని భయపడుతున్నారు. స్వచ్ఛమైన నీటినే సరఫరా చేయాలని కోరుతున్నారు.

పన్నులు చెల్లించడం ప్రతి పౌరుడి బాధ్యత



చార్టెడ్ అకౌంటెంట్ డాక్టర్ నాగవల్లిని సత్కరిస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పన్నులు చెల్లించం ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ డాక్టర్ వై.నాగవల్లి అన్నారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 'భారతదేశంలో పన్నుల వ్యవస్థ – కెరీర్ అవకాశాలు'పై అతిథి ఉపన్యాసం జరిగింది. ముఖ్య అతిథిగా నాగవల్లి ప్రసంగించారు. పన్నులు దేశ ఆర్థికాభివృద్ధికి ఎంత ముఖ్యమో వివరించారు. పన్నుల రంగంలో ఉన్న విభిన్న కెరీర్ అవకాశాలను వివరించారు. సీఏ, సీఎంఏ వంటి కోర్సుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ రంగంలో విజయాన్ని సాధించడానికి కృషి, పట్టుదల, సమయపాలన ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. కెరీర్ రూపకల్పనలో ఇలాంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. పన్నుల రంగంలో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వాణిజ్య విభాగాధిపతి కొండలరావు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన సీఎం చంద్రబాబు

ఆటో మోటారు కార్మిక సంఘాల ఐక్య వేదిక



మాట్లాడుతున్న దాది శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాసెంట్రల్): ఆటో మోటార్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు పూర్తిగా విస్మరించారని ఆటో మోటారు కార్మిక సంఘాల ఐక్యవేదిక విమర్శించింది. అనంతపురం సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో నిర్వహించిన సభలో ఆటో కార్మికులందరికి దసరా పండుగ రోజున వాహన మిత్ర రూ.15 వేలు ఇస్తానని చంద్రబాబు ప్రకటించారని, కానీ స్త్రీ శక్తి పథకంతో ఆదాయం కోల్పోయిన ఆటో, టాటా మేజిక్ వంటి డ్రైవర్లకు వాహన మిత్ర సహాయం పెంచాలన్న కార్మిక సంఘాల అభ్యర్థనను పట్టించుకోలేదని ఐక్యవేదిక మండిపడింది. ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశం ఆటో మోటార్ కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు ముజఫర్ అహ్మద్, ఇఫ్టూ నాయకుడు దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కార్మికులకు ఐదు ప్రధాన హామీలిచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత వాటిలో ఒకదానిని మాత్రమే అమలు చేస్తానని ప్రకటించి, మిగిలిన వాటిని విస్మరించడం చంద్రబాబు మోసానికి నిదర్శమన్నారు. ఆగస్టు 15న ఆటో మోటార్ కార్మికుల సంఘాలతో చర్చించడానికి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశామని ప్రకటించారని, అది ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల హామీలైన జీఓ 21 రద్దు, ఆటో మోటార్ కార్మికులకు సాధికారిత బోర్డు, ఇంధన ధరల తగ్గింపు వంటి హామీలపై అనంతపురం సభలో ప్రస్తావించక పోవడంలోనే మోసం దాగి ఉందన్నారు. డ్రైవర్ల సంక్షేమం కోసం వాహనాల నుంచి లేబర్ సెస్సు వసూలు చేస్తున్నా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడం, ఆ నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఈ నెల 18న అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా విజయవాడలో ఆటో మోటార్ కార్మికులతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు రామకృష్ణ, ఈశ్వర్, ఏపీ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.పోలారి, ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నాయకుడు దుర్గారావు, ఏపీ ప్రోగ్రెసివ్ మోటార్ అండ్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎం.ఈశ్వర్, ఆటో కార్మిక సంఘాల నాయకులు రవీంద్ర, సీహెచ్ పెద్దిరాజు, ముని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్జరీ నైపుణ్యాలు పెంచుకోవాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న విద్యార్థులు సర్జరీ నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ రఘునందనరావు అన్నారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్యూచర్ నాటింగ్ హ్యాండ్స్–ఆన్ వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ రఘునందనరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు శస్త్ర చికిత్స నైపుణ్యాలు పెంచుకునేందుకు ఈ వర్క్‌షాపు దోహదం చేస్తుందని తెలిపారు. స్యూచర్ టెక్నిక్‌లు, విధి నిర్వహణ పద్ధతి, రోగులతో అనుసంధానం, నిబద్ధత వంటి అంశాలపై విలువైన సూచనలు ఇచ్చారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యవంతమైన సర్జన్‌లుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ దుర్గారాణి, డాక్టర్ బీఎస్‌పీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.